సాక్షి
విశాఖపట్నం

గురువారం । 5 । అక్టోబర్ । 2023



ఆధిక్యంలోకి ఆరవ్, ప్రతీతి

ఓపెన్‌లో టాప్ బోర్డుపై ఆధిక్యానికి మాదేష్-ఆరవ్‌ల మధ్య జరిగిన పోటీలో ఆరవ్ విజయంతో సత్తా చాటాడు. 8లో



అవగాహన లేకే వ్యాధులు

శారీరక, మానసిక అలవాట్లలో మార్పులు, సరైన అవగాహన లేకపోవడం వల్లే మానసిక అనారోగ్యానికి గురవుతున్నారు. 8లో

వసతి భవనం ప్రారంభం



సింథియా : తూర్పు నావికాదళ కమాండ్‌కు చెందిన డిఫెన్స్ సివిలియన్ వివాహిత సిబ్బంది కోసం నిర్మించిన వసతి భవనాన్ని బుధవారం నేవల్ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ప్రారంభించారు.

న్యూస్‌రీల్

ఏయూ రిజిస్ట్రార్‌గా జేమ్స్ స్టీఫెన్



వీసీ నుంచి నియామక పత్రం స్వీకరిస్తున్న ఆచార్య జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి బుధవారం ఆయన నియామక ఉత్తర్వులు స్వీకరించారు. కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని ఏయూ పాలక మండలి సభ్యులు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులు అభినందించారు. కాగా.. ఆచార్య జేమ్స్ స్టీఫెన్ ప్రస్తుతం ఏయూలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చైర్ నేషనల్ చైర్ ప్రొఫెసర్‌గా, ఏయూ ట్రాన్స్ డిసిప్లీనరీ హబ్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు 21 ఏళ్ల సుదీర్ఘ బోధన అనుభవం ఉంది. పదేళ్లుగా పరిపాలన సంబంధిత పదవుల్లో ఉన్నారు. ఏయూ పాలక మండలి సభ్యుడిగా పనిచేశారు. కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 32 పేటెంట్‌లు, కాపీరైట్‌లు కలిగి ఉన్నారు. తొమ్మిది జాతీయ, అంతర్జాతీయ గ్రాంట్స్ సాధించారు.

పెండింగ్ జరిమానాలు చెల్లించండి



జాతీయ రహదారిలో తనిఖీలు చేపడుతున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: వాహన చోదకులు పెండింగ్ జరిమానాలు చెల్లించాలని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం కోరారు. రవాణా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో కొందరు జరిమానాలు చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. పెండింగ్ జరిమానాలు కట్టకుండా.. తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. 15 రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో 244 వాహన యజమానులకు రూ.20లక్షల వరకు జరిమానా విధించినట్లు చెప్పారు. https://aprtacitizen.epragathi. org/#!/ vcrdetails ను సందర్శించి అపరాధ రుసుం చెల్లించాలని సూచించారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో అత్యవసరంగా నిలిపివేసిన రెండో యూనిట్‌లో బుధవారం రాత్రి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్ నుంచి సరఫరా జరుగుతున్న విద్యుత్‌కు తగినంత డిమాండ్ లేని కారణంగా ఈ నెల 1న మధ్యాహ్నం రిజర్వ్ షట్‌డౌన్ చేశారు. మూడు రోజుల అనంతరం సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ రెండో యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించామని, ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని సంస్థ అధికార వర్గాలు వెల్లడించాయి.

గంగవరం పోర్టు రికార్డు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు రేక్‌ల నిర్వహణలో సరికొత్త రికార్డు సాధించింది. ఒక్క రోజులో అత్యధికంగా 160 రేక్‌లు లోడ్ చేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు విద్యుత్ పరిశ్రమలకు సరుకును పంపింది. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ గంగవరం పోర్టులో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని వివరించారు. అలాగే వారికి గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలను కల్పిస్తున్నామని తెలిపారు.

వెబ్‌సైట్‌లో బ్యాక్‌లాగ్ పోస్టుల ప్రొవిజినల్ జాబితా

ఏయూక్యాంపస్: దివ్యాంగుల విభాగంలో 23 బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితాను https://visakhapatnam.ap.gov.in/ లో పొందుపరిచారు. 24 బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నియామకానికి 2022–23లో నోటిఫికేషన్ విడుదల చేయగా.. వర్క్‌షాప్ అటెండెంట్ ఉద్యోగానికి అంధ-మహిళ విభాగంలో అర్హత కలిగిన అభ్యర్థులు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె. మాధవి తెలిపారు. ఉద్యోగ తరగతి, వైకల్యం ప్రకారం మెరిట్ జాబితా సిద్ధం చేశామన్నారు. సహేతుకమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 18 లోగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

ఔత్సాహికులకు అండదండలు

- పరిశ్రమల స్థాపనకు సత్వర అనుమతులు
- విశాఖ జిల్లాలో రూ.56 కోట్లతో రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం జగన్



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం/పద్మనాభం: పరిశ్రమలు ఏర్పాటు చేసే ఔత్సాహికులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండదండలు అందిస్తోందని, వారిపట్ల అత్యంత సానుకూలంగా ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులను సత్వరమే మంజూరు చేస్తోందన్నారు. ఈ పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టాన్ని తెచ్చామని గుర్తు చేశారు. బుధవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిశ్రమలు, ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) రంగంలో 13 ప్రాజెక్టులకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వీటిలో విశాఖ జిల్లా పద్మనాభం మండలం కృష్ణాపురంలో రూ.4.46 కోట్లతో ఏర్పాటయ్యే సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్, మద్దిలో రూ.52 కోట్లతో ఓరిల్ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ చేపట్టనున్న ఇన్‌స్టెంట్ చట్నీస్, పౌడర్ యూనిట్‌లు ఉన్నాయి. ఈ రెండు యూనిట్లలో 500 మంది వరకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. వీటితో పాటు అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కొడవటిపూడిలో రూ.20 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే నేటివ్ అరకు కాఫీ తయారీ యూనిట్‌కు కూడా సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ యూనిట్‌తో వెయ్యి మంది గిరిజన రైతులకు మేలు చేకూరనుంది. శంకుస్థాపనల అనంతరం ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో చేసుకున్న ఒప్పందాలు వేగంగా కార్యరూపం దాలుస్తుండడం అభినందనీయమన్నారు. ఈ పరిశ్రమలు ప్రారంభమైతే స్థానికులకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.

రైతులకూ ప్రయోజనం

పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వర్చువల్ శంకుస్థాపనలో పాల్గొన్న అనంతరం కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ఇక్కడ పరిశ్రమల స్థాపనతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అవసరమైన చిరుధాన్యాలను ఆ పరిసరాల్లోని రైతుల నుంచి కొనుగోలు చేస్తారన్నారు. తద్వారా స్థానిక రైతులకు కూడా లబ్ధి చేకూరుతుందన్నారు. అలాగే మద్దిలో ఏర్పాటయ్యే ఇన్‌స్టెంట్ చట్నీస్, పౌడర్, పచ్చళ్ల తయారీ పరిశ్రమ వల్ల 400 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు.

భీమిలికి మరిన్ని పరిశ్రమలు: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖ నుంచి పాలన సాగిస్తారన్నారు. దీంతో రాబోయే రోజుల్లో భీమిలి నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు వస్తాయన్నారు. ఓరిల్ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ సీఈవో దాసరి అవినాష్ మాట్లాడుతూ తమ పరిశ్రమలో తయారైన పచ్చళ్లను ప్యాకెట్ల రూపంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తామని తెలిపారు. అనంతరం ఈ రెండు యూనిట్ల శంకుస్థాపనల ఫ్లెక్సీని కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే శ్రీనివాసరావులు సంయుక్తంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.ఎ.రహీమ్, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, తహసిల్దార్ కె.వేణుగోపాల్, ఉద్యానశాఖ ఏడీ కె.మన్మథరావు, కృష్ణాపురం, మద్ది గ్రామాల సర్పంచ్‌లు లక్ష్మీభవానీ, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్యం

- ఏడు శిబిరాల్లో 3,786 మందికి వైద్య పరీక్షలు
- నేడు ఏడు చోట్ల శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు



మజ్జిపేటలో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద రోగులకు అండగా నిలుస్తోంది. స్పెషలిస్ట్ వైద్యులతో వైద్యం చేయిస్తోంది. ఎంతో ఖర్చుతో రక్త పరీక్షలను పూర్తి ఉచితంగా జరిపిస్తోంది. వ్యాధి నిరార్థణ అయితే రిఫరల్ ఆస్పత్రులకు పంపించి.. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తోంది.

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు బుధవారం ఏడు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ శిబిరాల్లో 3,786 మందికి వైద్య సేవలు అందించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. అర్బన్ పరిధి బాపూజీ నగర్ (కంచరపాలెం) యూపీహెచ్‌సీ, కొత్త గాజువాక యూపీహెచ్‌సీ, చినముషిడివాడ(పెందుర్తి) యూపీహెచ్‌సీ, చింతగట్ల(పెందుర్తి) వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గొట్టిపల్లి(ఆనందపురం) వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రేవిడి(పద్మనాభం) వైఎస్సార్ హెల్త్ క్లినిక్, మజ్జిపేట(భీమిలి)లో ఈ శిబిరాలు జరిగాయి. స్త్రీల వైద్యులు, పిల్లల వైద్యులు, జనరల్ ఫిజిషియన్, దంత వైద్యులు రోగులను పరీక్షించి.. అవసరమైన వారికి మందులు అందజేశారు.

నేడు జరిగే శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గురువారం ఏడు ప్రాంతాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అర్బన్ పరిధిలో గంగవరం(గాజువాక), సాగర్‌నగర్, ములగాడ(మల్కాపురం), పెందుర్తి పరిధిలో పెదగాడి, రేవడి-పద్మనాభం పరిధిలో మద్ది, భీమిలి పరిధిలో ఆర్.తాళ్లవలస-తాటితూరు, ఆనందపురం పరిధిలో చందకలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నా..



చినముషిడివాడలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నాను. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం బాగుంది. పేదలకు స్పెషలిస్ట్ వైద్య సేవలు లభించడంతో మేలు జరుగుతుంది.

– వై.వెంకటరావు, చినముషిడివాడ

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు. కొద్ది రోజులుగా కాళ్ల నొప్పులు, వాపులు, కడుపులో తిప్పడం వంటి సమస్యలతో బాధ పడుతున్నాను. పైసా ఖర్చు లేకుండా ఈ శిబిరంలో వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి మందులిచ్చారు. ఇదే వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే వేల రూపాయలు ఖర్చు అయ్యేది.

– మంత్రి పైడిరాజు, గాజువాక

పరిశుభ్రమైన సుందర నగరం విశాఖ



దావణగెరె కార్పొరేటర్ల బృందంతో నగర మేయర్, డిప్యూటీ మేయర్, ఫ్లోర్‌లీడర్, అధికారులు

- దావణగెరె కార్పొరేషన్ మేయర్ వినాయక
- జీవీఎంసీని సందర్శించిన బృందం

డాబాగార్డెన్స్: కర్ణాటక రాష్ట్రంలోని దావణగెరె సిటీ కార్పొరేషన్ బృందం బుధవారం జీవీఎంసీని సందర్శించింది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆ బృందానికి స్వాగతం పలికారు. అనంతరం జీవీఎంసీ సమావేశ మందిరంలో వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జీవీఎంసీ పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ 4వ స్థానంలో నిలిచిందని, పర్యావరణ హిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ఎకో వైజాగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. నగర సుందరీకరణకు అనేక చర్యలు చేపట్టామన్నారు. బస్సు బే, మోడ్రన్ టాయిలెట్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ట్రాఫిక్ నియంత్రణకు కూడళ్ల అభివృద్ధి, సమృద్ధిగా తాగునీరు, ఆర్ఆర్ఆర్ సెంటర్లు, బయో మైనింగ్ ప్లాంట్, స్పోర్ట్స్ ఎరీనా, ఆక్వా స్పోర్ట్స్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలకు 24 గంటలు తాగునీరు అందించే ప్రాజెక్టుల వివరాలను జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎస్ రవి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం దావణగెరె మేయర్ బీహెచ్ వినాయక్ మాట్లాడుతూ విశాఖ నగరం పరిశుభ్రతతో సుందరంగా కనిపిస్తుందన్నారు. ఇక్కడ అమలు చేస్తున్న ప్రాజెక్టులు ఆకట్టుకునేలా ఉన్నాయని, ఇదే తరహాలో దావణగెరె మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతరం ఆ బృందానికి మేయర్ జ్ఞాపికలు అందజేశారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, జీవీఎంసీ కార్యదర్శి నల్లనయ్య, డీసీ(ఆర్) ఫణిరామ్, దావణగెరె డిప్యూటీ మేయర్ యశోద, స్టాండింగ్ కమిటీ చైర్మన్లు అబ్దుల్ రషీద్, మీనాక్షి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బండారును బహిష్కరించాల్సిందే..

- రాజకీయాల నుంచి దూరం చేయాలి
- మహిళలంటే గౌరవం లేని వ్యక్తికి బుద్ధిచెప్పాలి
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ధ్వజం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు

సీతమ్మధార: మంత్రి రోజాపై మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడుతూ వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. బండారును టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని, రాజకీయంగా బహిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ మంత్రి రోజాను అసభ్య పదజాలంతో దూషించిన బండారు సత్యనారాయణమూర్తి తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలపై తన తీరు మార్చుకోకుంటే గట్టిగానే సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. బండారు ఇంటి మహిళలను కించపరిచేలా మాట్లాడితే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అచ్చెన్నాయుడు, చింతమనేని ప్రభాకర్ తదితరులు మహిళలపై దాడులు చేశారని, బాలకృష్ణ మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడారని గుర్తుచేశారు. అటువంటి నీచ చరిత్ర టీడీపీదేనని ఎద్దేవా చేశారు. బండారు వ్యాఖ్యలకు లోకేశ్ మద్దతు పలకడం బాధాకరమన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం..

జిల్లా ప్రధాన కార్యదర్శి రోజారాణి మాట్లాడుతూ బండారు సత్యనారాయణ ఏ మహిళ గురించి అయినా అసభ్యకరంగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు పేడాడ రమణికుమారి మాట్లాడుతూ మంత్రి రోజాపై బండారు ఇష్టానుసారంగా మాట్లాడుతుంటే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. మరోసారి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పల్లా చిన్నతల్లి, మాసిన లక్ష్మి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు రాధా, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత, సింహాచలం ట్రస్ట్ బోర్డు మెంబర్ రాజేశ్వరి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు యువశ్రీ, సలాది భాను, అనురాధ, లక్ష్మి, పప్పల సునీత, పలివెల ఈశ్వరి, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ద్రోణంరాజు శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం




ద్రోణంరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ తదితరులు

ఎంవీపీకాలనీ: మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు నగర ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. ద్రోణంరాజు శ్రీనివాస్ వర్ధంతి సందర్భంగా డాక్టర్స్ కాలనీ దరి ఆయన నివాసంలో బుధవారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని, ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు, పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. శ్రీనివాసరావుతో తమ అనుబంధాన్ని ఆయన కుమారుడు ద్రోణంరాజు శ్రీవత్సవతో పంచుకున్నారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన శ్రీనివాసరావు నగర ప్రజల్లో చెరగని ముద్ర వేశారన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై మంచితనానికి, నిజాయితీకి మారుపేరుగా నిలిచారన్నారు. ఆయన మరణం వైఎస్సార్ సీపీకి, విశాఖ ప్రజలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, బెహరా భాస్కరరావు, జియ్యాని శ్రీధర్‌తో పాటు నగర, గ్రామీణ జిల్లా నుంచి అనేక మంది సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ద్రోణంరాజు శ్రీనివాసరావుకు నివాళులర్పించారు.

సెలవుల్లో కాలేజీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం



మాట్లాడుతున్న డాక్టర్ సీతారాం

విశాఖ విద్య: బాలల హక్కుల ఉల్లంఘన జరిగితే ఉపేక్షించేది లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం హెచ్చరించారు. 'బాలల హక్కుల పరిరక్షణలో ఇంటర్మీడియట్ కాలేజీల ప్రిన్సిపాళ్ల పాత్ర' అనే అంశంపై బుధవారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో నగరంలోని ఏవీఎన్ కాలేజీలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఐఐటీ, జేఈఈ అనే భ్రమలను కల్పించి, నగరంలోని కొన్ని కార్పొరేట్ కాలేజీలు విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. చదువుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేయడం వారి హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లో కాలేజీలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించడానికి వీల్లేదన్నారు. అలాంటి కాలేజీల గుర్తింపు రద్దు చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యార్థులకు నాణ్యమైన చదువులు చెప్పాలన్నారు. అధ్యాపకులు వృత్తి నైపుణ్యత పెంచుకోవాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాల బోధన చేయాలన్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించే కాలేజీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏవీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, అసిస్టెంట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీలత, ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు చెందిన సుమారు 200 మంది ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నేడు, రేపు మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు

స్టార్టప్ ఇండియాతో కలిసి ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ నిర్వహణ

దొండపర్తి: మహిళా పారిశ్రామికవేత్తల సదస్సును గురు, శుక్రవారాల్లో రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్‌కుమార్ తెంటు ఒక ప్రకటనలో తెలిపారు. పారిశ్రామిక రంగంలో మహిళలకు ప్రోత్సాహం, వారి సాధికారతకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని పేర్కొన్నారు. స్టార్టప్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ), వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మహిళల కోసం స్టార్టప్‌లను ప్రారంభించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం స్టార్టప్ ఇండియా, ఆంధ్రప్రదేశ్‌లో ఇన్నోవేషన్ సొసైటీతో కలిసి రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్టార్టప్ ఇండియా ఈ ఈవెంట్‌ను ఇప్పటి వరకు 19 రాష్ట్రాల్లో ప్రమోట్ చేసిందని, మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం, మద్దతు ఇవ్వడం, అవకాశాలపై అవగాహన పెంచడం, వారి సొంత వ్యాపారాలను ప్రారంభించే విధంగా సహాయ సహకారాలు అందించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర ఐటీ అండ్‌సీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ పాల్గొంటున్నట్లు తెలిపారు.

బస్ పాస్ కౌంటర్ల పని వేళల్లో మార్పు

డాబాగార్డెన్స్: బస్ పాస్ కౌంటర్ల పని వేళలను మార్పు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.అప్పలరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బస్ పాస్ కౌంటర్లు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తున్నాయని వెల్లడించారు. ఇక నుంచి ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెంలోని కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, ఎంవీపీ, సింహాచలం, గాజువాక, కూర్మన్నపాలెం, మధురవాడ, పెందుర్తిలోని కౌంటర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు. ఈ మార్పులు గమనించాలని నగర ప్రజలను ఆయన కోరారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్ల పూర్తి

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీలో మిగులు సీట్లకు సంబంధించి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినట్లు కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కాలేజీలో 14 ఖాళీలు ఉండగా వీటిలో 9 ఈడబ్ల్యూఎస్ సీట్లు ఉన్నాయి. మిగతావి జనరల్ అండ్ రిజర్వేషన్ కేటగిరీలో మిగిలాయి. ఓపెన్ కేటగిరీలో 2, రిజర్వేషన్ కేటగిరీలో 3 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ లోని ఏయూ రీజియన్‌కు చెందిన ఒక సీటు భర్తీ చేశారు. ప్రస్తుతం అభ్యర్థులు లేకపోవడం వల్ల ఎస్‌వీ యూనివర్సిటీ రీజియన్‌కు చెందిన 8 ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో మిగిలిపోయాయి. వీటిని మార్పు చేయడానికి వీల్లేదని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. స్పాట్‌లో 4,700 కాలేజీ ఫీజు, రూ.700 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి జాయిన్ అయ్యారని, వీరికి తరగతులు ప్రారంభమయ్యాయని చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి మెటలర్జీ నుంచి ఎలక్ట్రికల్ విభాగంలో స్లైడింగ్‌లో ఇద్దరు విద్యార్థులు చేరారు. సివిల్‌లో రెండు ఖాళీలు భర్తీ చేశారు. మెటలర్జీలో ఏర్పడిన నాలుగు ఖాళీలు భర్తీ అయ్యాయి. కేవలం ఓసీ ఈడబ్ల్యూఎస్ కోటాకు సంబంధించి సివిల్‌లో 6, మెటలర్జీలో 5 సీట్లు మిగిలాయి.

ఐటీఐలో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం: జిల్లాలోని వివిధ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో 2023–24 విద్యా సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీ కోసం ఐదో విడత ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. అభ్యర్థులు iti.ap.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలకు ఒక దరఖాస్తు సరిపోతుందని తెలియజేశారు. నమోదైన విద్యార్థులు తమ దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకుని, అప్రూవ్ చేయించుకోవాలని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుకు సంబంధించిన అభ్యర్థులు ప్రత్యేక కేటగిరీలో దరఖాస్తు చేసుకుని, విధిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5గంటల లోగా అందజేయాలని సూచించారు. 9న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 10న జరిగే ప్రవేశాల కొరకు ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్)లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

అవగాహన లేకే మానసిక వ్యాధులు

మహారాణిపేట: శారీరక, మానసిక అలవాట్లలో మార్పులు, సరైన అవగాహన లేకపోవడం వల్లే మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. మానసిక ఆరోగ్య వారోత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం ప్రభుత్వ మానసిక వైద్యశాల, విశాఖ సైకియాట్రిక్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. సమాజంలో గత 40–50 ఏళ్లలో అనేక మార్పులు వచ్చాయన్నారు. వీటిపై ఏయూ, ప్రభుత్వ మానసిక వైద్యశాల సంయుక్తంగా అవగాహన కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ చేద్దామన్నారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ప్రాధాన్యాన్ని వివరించారు. మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది నినాదం.. మానసిక ఆరోగ్యం ఒక సార్వత్రిక మానవ హక్కు అనే అంశాన్ని వివరించారు. ఏఎంసీ మానసిక వైద్య విభాగం ప్రధానాచార్యులు డాక్టర్ డి.విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మానసిక అనారోగ్యంపై ఉన్న వివక్షను నిర్మూలించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. విశాఖ సైకియాట్రిక్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల గురించి సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వృద్ధుల మానసిక వైద్య విభాగం ఓపీ కోసం నూతనంగా సిద్ధమైన గదులను ప్రారంభించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, రోగులు, వారి బంధువులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌పై పోలీస్ జట్టు విజయం

విశాఖ స్పోర్ట్స్: వీడీసీఏ ఇనిస్టిట్యూషన్ లీగ్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఏపీఈపీడీసీఎల్ జట్టుపై సిటీ పోలీస్ జట్టు 146 పరుగుల తేడాతో విజయం సాధించింది. వైఎస్ఆర్ బి గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 238 పరుగులు చేసింది. ప్రతిగా ఈపీడీసీఎల్ జట్టు 14 ఓవర్లలోనే 92 పరుగులకే ఆలౌటైంది. గోపీకృష్ణ 123 పరుగులతో నిలవగా కార్తీక్ నాలుగు, శివకేశవ నాలుగు వికెట్లు వారిజట్ల తరపున తీశారు.

రూ.కోట్ల భూమి కాజేసే కుట్ర

- అడవివరంలో 20 ఎకరాలపై కన్నేసిన కబ్జాదారులు
- అక్రమార్కులతో చేతులు కలిపిన సర్వేయర్లు
- ఈ వ్యవహారంపై కోర్టుకు వెళ్లిన సింహాచలం దేవస్థానం
- మరోసారి సర్వే నిర్వహించిన జేసీ విశ్వనాథన్
- ఆ భూమి మొత్తం అటవీ ప్రాంతంగా గుర్తింపు
- సర్వే ఏడీ, డీఐవోఎస్, ముగ్గురు సర్వేయర్లపై క్రమశిక్షణ చర్యలు!



ఈ భూమిలోనే పొజిషన్ ఉన్నట్లుగా పిటిషన్ దాఖలు చేసిన వైనం



భూమిని స్వయంగా పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్, భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం : అది సింహాచలం దేవస్థానానికి చెందిన అటవీ ప్రాంతం.. తాము అక్కడ నివాసముంటున్నామని పలువురు.. ప్రభుత్వ సర్వేయర్లు ఇచ్చిన రిపోర్టుతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అఫిడవిట్ చూసిన జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అక్కడ నివాసం కాదు.. పూర్తి చెట్లతో నిండిన అడవి ఉందని గుర్తించారు. రూ.కోట్ల భూమిని కొట్టేసేందుకు వేసిన ఎత్తుగడకు సహకరించిన ప్రభుత్వాధికారులపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించారు.

అడవివరం గ్రామంలో సర్వే నెంబర్ 275లో 20.39 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమికి సంబంధించి హద్దులు నిర్ణయించడంతో పాటు అక్కడ ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న నేపథ్యంలో రెవెన్యూ రికార్డులో తమ పేరుతో మార్చేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని బి.మంగతల్లితో పాటు మరో ఆరుగురు హైకోర్టులో రిట్‌పిటిషన్ వేశారు. పిటిషనర్ దరఖాస్తుపై నెల రోజుల్లో తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు విశాఖ రూరల్ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సర్వే విభాగం అధికారులు సదరు భూమికి సర్వే నిర్వహించారు. 1903 సేల్ ప్రకారం అడవివరం గ్రామంలో సర్వే నెంబర్ 275లో ఉన్న 20.39 ఎకరాల భూమి మంగతల్లి కుటుంబ సభ్యుల ఆధీనంలోనే ఉందని, వారు పొజిషన్‌లు ఉన్నారని నిర్ధారిస్తూ నివేదిక సమర్పించారు. సర్వే అధికారుల నివేదిక ఆధారంగా ఆ భూమి తమదేనని, సింహాచలం దేవస్థానం అధికారులు ఈ భూమి విషయంలో జోక్యం చేసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని మరోసారి మంగతల్లి మరో ఆరుగురు హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు స్టాటస్ కో ఇచ్చింది.

సర్వే నివేదిక తప్పంటూ దేవస్థానం పిటిషన్

సర్వే విభాగం ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ సింహాచలం దేవస్థానం అధికారులు 2021, అక్టోబర్ 20న రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. సదరు నివేదిక సక్రమంగా లేదని, సర్వే నెంబర్ 275లో మొత్తం 5,279.57 ఎకరాల భూమి దేవస్థానం పరిధిలోనే ఉందని, ఈ సర్వే నంబర్‌కు సంబంధించి ఎలాంటి సబ్ డివిజన్లు లేవని పిటిషన్‌లో స్పష్టం చేశారు. అదేవిధంగా ఈ విస్తీర్ణం మొత్తం 22ఏ జాబితాలో చేర్చడం జరిగిందని, ఆ భూమిలో దేవస్థానం కాంపౌండ్ వాల్ నిర్మాణం కూడా ఉందని న్యాయస్థానానికి విన్నవించారు. ఈ పిటిషన్‌పై స్పందించిన జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్.. జాయింట్ సర్వే బృందానికి, సర్వే, భూరికార్డుల శాఖ అధికారులకు నోటీసులు జారీ చేశారు. అప్పుడే సర్వే బృందం అవకతవకలు బయటపడ్డాయి.

స్వయంగా పరిశీలించిన జేసీ

2021లో సర్వే చేసిన విశాఖ రూరల్ మండలం అప్పటి సర్వేయర్, ప్రస్తుత గోపాలపట్నం సర్వేయర్ డి.జగదీశ్వరరావు, సింహాచలం దేవస్థానం అప్పటి సర్వేయర్ కె.హరీష్‌కుమార్, అప్పటి గోపాలపట్నం సర్వేయర్, ప్రస్తుతం యలమంచిలి సర్వేయర్ సత్యనారాయణ, డీఐవోఎస్ కె.వేణుగోపాల్‌ను అధికారులు విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. అదేవిధంగా ఈ ఏడాది మే 15న భీమిలి ఆర్డీఓ భాస్కర్‌రెడ్డి, సింహాచలం దేవస్థానం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, ఇతర అధికారులతో కలిసి జేసీ కేఎస్ విశ్వనాథన్ స్వయంగా ఆ భూమిని పరిశీలించి విస్తుపోయారు. పిటిషన్ వేసిన వారి భూ పత్రాల్లో సదరు భూమి గోపాలపట్నం మండలం మాధవధారలో ఉంది. కానీ వారు చూపిస్తున్న భూమి, వారి డాక్యుమెంట్‌లో ఉన్న భూమికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైంది. దీని ప్రకారం సర్వే నెంబర్ 275లో ఉన్న భూమి సింహాచలం దేవస్థానం ఆధీనంలో ఉందని గుర్తించారు. ఆ భూమిలోనే పొజిషన్‌లో ఉన్నట్లు సర్వేయర్లు ఇచ్చిన నివేదిక తప్పు అని బట్టబయలైంది. ఈ కేసులో ప్రమేయం ఉన్న సర్వే ఏడీ విజయ్‌కుమార్, డీఐవోఎస్ వేణుగోపాల్, ముగ్గురు సర్వేయర్లపై క్రమశిక్షణ చర్యలకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ భూమిని సింహాచలం దేవస్థానానికి అప్పగించినట్లు ఆయన తెలిపారు.



29న యోగాసన పోటీలు

డాబాగార్డెన్స్: ఉత్తర కోస్తా జిల్లా స్థాయి యోగాసన పోటీలను ఈ నెల 29న ఆర్కే బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్ వేదికగా నిర్వహించనున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కేపీ రాజు(యోగా రాజు) తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా 10 గ్రూపులుగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 8 ఏళ్ల నుంచి 50 ఏళ్ల పైబడిన యోగసాధకులు వివిధ విభాగాల్లో పోటీల్లో పాల్గొనవచ్చని తెలియజేశారు. మొదటి మూడుస్థానాల్లో నిలిచిన మహిళలు, పురుషులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తామని, ప్రముఖుల చేతులమీదుగా సత్కరిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 20లోగా ప్రెసిడెంట్, 14–1–36, దసపల్లా హిల్స్, మహారాణిపేట(పోస్ట్), విశాఖపట్నం చిరునామాలో నేరుగా సంప్రదించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 98669 61122, 98482 15863 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకట రమేష్ , ప్రొఫెసర్ భాను కుమార్, రమణమూర్తి పాల్గొన్నారు.

ఆధిక్యంలోకి ఆరవ్, ప్రతీతి

- వెనుకబడ్డ హాన్య షా
- ఉత్సాహంగా చదరంగం పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఓపెన్‌లో టాప్ బోర్డుపై ఆధిక్యానికి మాదేష్–ఆరవ్‌ల మధ్య జరిగిన పోటీలో ఆరవ్ విజయంతో సత్తా చాటాడు. ఆరన్నరపాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అండర్–11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్‌లో భాగంగా నాలుగో రోజు బుధవారం రెండు రౌండ్ల పోటీలు పోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఐదున్నరేసి పాయింట్లతో రెండో బోర్డుపై తలపడిన రితేష్‌పై ఆన్ష్, మూడో బోర్డ్‌పై కృషయ్‌పై ఆయాన్ విజయం సాధించి.. ఆరున్నరేసి పాయింట్లతో ఎనిమిదో రౌండ్‌కు చేరుకున్నారు. మెరుగైన రేటింగ్‌లో ఉన్న క్యాండిడేట్ మాస్టర్ వివాన్(1909) అనూహ్యంగా శ్రీ అఖిల్(ఏపీ) ఎత్తులకు చిత్తయ్యాడు. బాలికల్లో టాప్ బోర్డ్‌పై ప్రతీతి ఐదున్నర పాయింట్లతో ఆధిక్యంలో బరిలోకి దిగిన హాన్య షా(ఆరు పాయింట్లు)పై విజయంతో దూసుకెళ్లింది. ఆరున్నర పాయింట్లు సాధించి ఎనిమిదో రౌండ్‌కు సిద్ధమైంది. రెండో బోర్డ్‌పై ఐదున్నరేసి పాయింట్లతో తలపడిన ఏఎఫ్ఎం త్రిపురాంబిక(ఏపీ)తో సిద్ధి డ్రాగా ముగించుకుంది. ఇద్దరూ ఆరేసి పాయింట్లతో ఎనిమిదో రౌండ్‌కు చేరుకున్నారు. ఏఎఫ్ఎంలు మైషా ప్రత్యర్థి ఆర్పిత చేతిలో పరాజయం పాలవగా దియా భావన్యపై విజయంతో ఆరు పాయింట్లతో కొనసాగుతోంది. బాలికల ఎనిమిదో రౌండ్‌లో టాప్ బోర్డుపై ప్రతీతితో శరణ్య తలపడనుండగా.. ఓపెన్‌లో ఆరున్నరేసి పాయింట్లతో టాప్ బోర్డ్‌పై ఆయాన్‌తో ఆరవ్, రెండో బోర్డ్‌పై ఆన్ష్‌తో సిద్ధార్థ(ఆరు పాయింట్లు) పోటీ పడనున్నాడు.

ఆరో రౌండ్‌లో హాన్య షా, మాదేష్ ఆధిక్యం

ఆంధ్రా చెస్, ఆల్ విశాఖ చెస్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న బాలికల ఆరో రౌండ్‌లో విజయంతో హాన్య షా(గుజరాత్) ఆరు పాయింట్లు సాధించగా.. ప్రతీతి(కర్నాటక), సిద్ధి(కర్ణాటక)లతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎరీనా ఫిడే మాస్టర్(ఏఎఫ్ఎం) త్రిపురాంబిక డ్రాలతో ఐదున్నరేసి పాయింట్లతో నిలిచి ఏడో రౌండ్‌కు సిద్ధమయ్యారు. ఓపెన్ ఆరో రౌండ్‌లో విజయంతో ఆరు పాయింట్లతో మాదేష్(పుదుచ్చేరి) ఆధిక్యంలోకి రాగా... రితేష్(తెలంగాణ), ఆరవ్(కర్ణాటక), ఆయాన్(చండీగఢ్), ఆన్ష్ నందన్(మహారాష్ట్ర), కృషయ్(పశ్చిమబెంగాల్) ఐదున్నరేసి పాయింట్లతో నిలిచి ఏడో రౌండ్‌కు సిద్ధమయ్యారు.



హాన్య షాతో తలపడుతున్న వితస్త

అప్పన్న సన్నిధిలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ టు కమ్యూనికేషన్స్ కాన్‌సిస్టింగ్ చైర్‌పర్సన్ ప్రతాప్‌రావు జాదవ్, సభ్యుడు పి.ఆర్.నటరాజన్ సంతోష్ పాండే దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. సంప్రదాయం ప్రకారం ఏఈవో భ్రమరాంబ స్వామివారి ప్రసాదం అందజేశారు. బీఎస్ఎన్ఎల్ డీజీఎం జగదీశ్వరరావు, డీఈ రమేష్, ఎస్‌డీఈ భగవాన్ దర్మాన, తదితరులు పాల్గొన్నారు.



కప్పస్తంభం వద్ద ప్రతాప్ రావు జాదవ్

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్లో ఈ నెల 6న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) ప్రకటనలో తెలిపారు. ఫ్యూజన్ టైల్స్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, ఎక్స్‌ప్రెస్ బీస్, మార్షల్స్ పెట్ జోన్, యంగ్ ఇండియా, మ్యాక్స్ ఫ్యాషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 260 ఖాళీల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సేల్స్ మేనేజర్, షోరూమ్ మేనేజర్, డెలివరీ బాయ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ సేల్స్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, స్టోర్ మేనేజర్, కస్టమర్ సపోర్ట్ అసోసియేట్, డెవలప్‌మెంట్ మేనేజర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. అభ్యర్థుల వయసు 18–28 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, కంప్యూటర్ నాలెడ్జ్, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వేతనం ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.14 వేల నుంచి 22 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

కేకే లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : ఇటీవల వాల్తేర్ డివిజన్, కొత్తవలస – కిరండూల్ (కేకే) లైన్, మనబార్ – జరాటి స్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్‌పై కొండ చరియలు విరిగిపడిన ప్రాంతంలో ఇంకా పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

- ఈ నెల 4, 5న భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్ – జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్ – భువనేశ్వర్ (18448) ఎక్స్‌ప్రెస్‌గా జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన రైలు ఈ నెల 5, 6న కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది.
- ఈ నెల 4, 5న విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్ – విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్‌గా కిరండూల్‌లో బయల్దేరాల్సిన రైలు ఈ నెల 5, 6న కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- ఈ నెల 5, 6న విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ 5, 6న అరకు నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- ఈ నెల 4, 5న హౌరాలో బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్ – హౌరా (18006) ఎక్స్‌ప్రెస్ 5, 6న టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

100 కిలోల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి

కూర్మన్నపాలెం : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ అధికారులు, దువ్వాడ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలపై 100 కేజీల గంజాయిని తరలిస్తున్నట్టు ముందస్తు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు, దువ్వాడ పోలీసులు 86వ వార్డు లక్కరాజుపాలెం వద్ద మాటు వేశారు. ఈ క్రమంలో గంజాయితో వస్తున్న ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. సబ్బవరం ప్రాంతానికి చెందిన మర్ర రాంబాబు, నర్సీపట్నానికి చెందిన రత్తుల జగన్, కంచరపాలెం ప్రాంతానికి చెందిన కొత్తకోట వెంకటరమణలను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 100 కేజీల గంజాయిని, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను, 4 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. సబ్బవరానికి చెందిన నాగరాజు, రోలుగుంటకు చెందిన సరమండ మూర్తి పరారీలో ఉన్నారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎన్‌జేసీఎస్ సమావేశం

ఉక్కునగరం : నేషనల్ జాయింట్ కౌన్సిల్ ఫర్ స్టీల్ (ఎన్‌జేసీఎస్) సమావేశం గురువారం న్యూఢిల్లీలో జరగనుంది. ఈ సమావేశంలో సెయిల్ ఉత్పత్తి, ఉత్పాదకత గురించి చర్చించనున్నారు. 2022–23కి సంబంధించి గణాంకాలను వివరించనున్నారు. అదే విధంగా బోనస్ అంశంపై చర్చించనున్నారని సమాచారం. ఈ సమావేశానికి సెయిల్ చైర్మన్, డైరెక్టర్లతో పాటు ఎన్‌జేసీఎస్ నాయకులు హాజరవుతున్నారు.

షెడ్డు పైనుంచి పడి కార్మికుడి మృతి

ఆనందపురం : ప్లై వుడ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు బుధవారం కంపెనీ షెడ్ పైకప్పు మీద నుంచి జారిపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక మండలం మల్కాపురం దరి పిలకవానిపాలేనికి చెందిన గొందేసి జగదీశ్వర రెడ్డి(40), చుక్క ఆదిమూర్తి, మహమ్మద్ ఇస్మాయిల్, రాహుల్ కిషోర్ మండలంలోని వెల్లంకి పంచాయతీ గారిపేటలో ఉన్న రీగల్ ప్లై వుడ్ కంపెనీలోని షెడ్డు పైకప్పు రేకులు వేసే పని నిమిత్తం గత ఐదు రోజులు నుంచి వస్తున్నారు. సాయంత్రం పని ముగించుకొని ఇంటికి వెళ్లి పోతున్నారు. బుధవారం ఉదయం నలుగురూ పనిలోకి వచ్చారు. షెడ్డు పైకప్పు పైన జగదీశ్వర రెడ్డి, రాహుల్ కిషోర్ ఉండగా కింద నుంచి చుక్క ఆదిమూర్తి, మహమ్మద్ ఇస్మాయిల్ తాడుతో రేకులను పైకి అందిస్తున్నారు. ఈ క్రమంలో పైన అమర్చిన రేకుపై కూర్చున్న జగదీశ్వర రెడ్డి అది కాస్తా విరిగిపోవడంతో కిందకు పడిపోయాడు. తలకు సిమెంట్ స్తంభం ఇనుప ఊచ దిగబడడంతో బలమైన గాయమైంది. వెంటనే తోటి కార్మికులు చికిత్స కోసం మధురవాడ గాయత్రి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని అన్నయ్య సత్యానారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అప్పలరెడ్డి, రమణమ్మ దంపతులకు ఆరుగురి సంతానం కాగా జగదీశ్వర రెడ్డి ఆఖరివాడు. తండ్రి మరణించగా తల్లి రమణమ్మను జగదీశ్వర రెడ్డే పోషిస్తున్నాడు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జగదీశ్వర రెడ్డి (ఫైల్)

సీఐఐ బృందం హార్బర్ పర్యటన

మహారాణిపేట: న్యూఢిల్లీ నుంచి వచ్చిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) బృందం బుధవారం ఫిషింగ్ హార్బర్‌లో పర్యటించింది. సీఐఐ (ఫుడ్ ప్రాసెసింగ్) డైరెక్టర్ ప్రజ్ఞా నెహ్రూ, డిప్యూటీ డైరెక్టర్ హర్షవర్ధన్, ప్రతినిధులు హార్బర్ అభివృద్ధి కార్యక్రమాలు, రోజువారీ వ్యవహారాలు, మార్కెటింగ్ విధానం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆధ్వర్యంలో బోటు యజమానులు, వాటాదారులతో అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, మార్కెటింగ్ విధానంలో తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. మార్కెటింగ్‌లో ఆన్‌లైన్ విధానం తీసుకురావడం వల్ల మత్స్యకారులకు, వాటాదారులకు మెరుగైన రేటు సమకూరి ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంటుందని మత్స్యకారులు, బోటు యజమానులతో జరిగిన సమావేశంలో డైరెక్టర్ ప్రజ్ఞా నెహ్రూ అన్నారు. బోటు యజమానులు మార్కెటింగ్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను వాసుపల్లి జానకిరామ్ ఈ సందర్భంగా ప్రతినిధుల బృందం దృష్టికి తీసుకువచ్చారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి మెరుగైన విధానం తీసుకురావడానికి సీఐఐ పూర్తిస్థాయిలో మత్స్యకారులకు సహకరిస్తుందని డైరెక్టర్ ప్రజ్ఞా నెహ్రూ తెలిపారు. సమావేశంలోఅసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుంటు దానయ్య, కోశాధికారి మల్లిపల్లి నర్సింహులు, వై.శ్రీనివాసరావు, పుక్కళ్ళ ఈశ్వరరావు, దూడ ధనరాజు, వాసుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఐఐ ప్రతినిధులతో ఏపీ మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జానకిరామ్

6న మిజోరం గవర్నర్ రాక

మహారాణిపేట: మిజోరం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు ఈ నెల 6న స్వస్థలానికి వస్తున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2.55 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి దసపల్లా హిల్స్‌లో తన సొంత ఇంటికి వెళతారు. 11న వాల్తేర్ క్లబ్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 16న ఉదయం 7 గంటలకు విశాఖ నుంచి విమానంలో హైదరాబాద్ వెళతారు.